# కథ

**- తమిరిశ జానకి**

దగ్గరగావేసి ఉన్న తలుపుల్ని విసురుగా తోసుకొని సుడిగాలిలా శ్రీపతి రూమ్‌లోకి దూసుకొచ్చాడు. చలం ఆ రోజు ఆదివారం అయినా ఏ ప్రోగ్రామూ వేసుకోపోవడం వల్ల మంచం మీద అడ్డంగా పడుకుని ఆదివారం సుఖాన్ని అనుభవించేస్తున్నాడు శ్రీపతి. కాళ్ళవైపు కూచుంటే ఇంతోటి తనపరువుకీ భంగం అనికాబోలు మంచంమీద నెత్తిన కూచున్నాడు.

"ఒరేయ్ అర్జంటుగా నాకో కథ రాసియ్యరా ఓ అందమైన అమ్మాయి మీద ఇప్పుడే ఈ నిమిషంలో..." అంటూ

అప్పుడప్పుడు, హాబీగా ఒకటీ అరా కథలు రాసే జబ్బుంది శ్రీపతికి. ఎటొచ్చీ తిరుగొచ్చే కథల సంఖ్యే ఎక్కువ. పడేవాటికంటే. "అర్జంటుగా కథరాసి నీకివ్వాలా? ఏ పత్రిక్కో పంపుకుంటానుగానీ నీకెందుకిస్తాను రాస్తే మటుకు?" వాల్చిన నడుం అనే భాగాన్ని లేవదియ్యక తప్పలేదు.

"ఒరేయ్! కాళ్ళుచ్చుకు బతిమాలుతున్నానని నెత్తెక్కి కూచోకు. ఓ అందమైన అమ్మాయి మీద అర్జంటుగా ఓ కథ రాసిస్తావా లేదా? లేకపోతే కాళ్ళకి బదులు పీక పుచ్చుకుంటాను జాగర్త" వీడేదో అన్నంత పనీ చేసేలాగా ఉన్నాడనిపించింది శ్రీపతికి. ఉద్యోగం పెర్మనెంటు అవగానే, పెళ్ళి చేసుకుని ఏదో వెలగబెడదామని కలలు కంటున్నప్పుడు వెలగబెట్టేది కాపురం అంతకంటే మరేమీ కాదు) మధ్యన వీడి పాల పడటమెందుకూ?

"నిన్నరాత్రి ఓ కథ రాశాను. రేపు పోస్టు చేద్దామనుకున్నాను అదిచ్చెయ్యనా?" అలమార్లోంచి తీస్తుంటే ఇంచుమించు చేతిలోంచి లాక్కున్నట్టే తీసుకున్నాడు చలం ఆ కాగితాల్ని.

"ఒరేయ్ ఏవిట్రా ఆ తొందర? కూర్చుని చదువు ముందు. వెళ్ళిపోతున్నావేంటప్పుడే?"

"చదివే ఓపికా తీరుబడీ లేవు. గానీ మళ్ళీ రేపు కలుస్తాను" అంటూ వచ్చినంత విసురుగానూ వెళ్ళిపోయాడు చలం. అసలుసంగతేమిటో సస్పెన్సులో పెట్టి.

మర్నాడురాత్రి, సినిమాలో స్టంటుసీనులో చావుదెబ్బలు తిన్న ఎక్స్ట్రా గాడిలా తూలుకుంటూ రూమ్‌లో అడుగుపెట్టిన చలాన్ని చూస్తూనే నోరెళ్ళబెట్టాడు శ్రీపతి. "ఒరేయ్ ఏంరాశావురా ఆ కథలో?" పళ్ళు కొరుకుతూ శ్రీపతి కాలరుచ్చుకున్నాడు.

"అసలేవిట్రా సంగతీ?" భయపడుతూ ముందుకాలర్ విడిపించుకున్నాడు. ఎవడిచేతో ఇన్ని దెబ్బలు తినొచ్చికూడా ఇంకా వీడిలో ఇంత ఓపికెలా ఉందా అనివిస్తుపోయాడు.

"నేనో అమ్మాయిని ప్రేమిస్తున్నాననీ, నా ప్రేమ ఇప్పటివరకూ వన్‌వే ట్రాఫిక్ అనీ చెప్పాను కదూ నీతో చాలాసార్లు. ఆ అమ్మాయి ప్రతిరోజూ వాళ్ళ అన్నయ్య కూతుర్ని తీసుకుని

పార్కు కొచ్చి కూచుంటుంది కొంతసేపు. అవకాశం దొరికినప్పుడు, ఆ అమ్మాయిని నేను ప్రేమిస్తున్న విషయం చెప్పాలని రోజూ నేనూ పార్కుకెళ్లి ఆమెకి కనబడేలా కూచుంటున్నాను. నిన్న నీ రూమ్‌కొచ్చాను చూడు అప్పుడే నాకు తెల్సింది ఆ అమ్మాయికి కథలు రాసేవాళ్ళంటే ఇష్టం అని నీ దగ్గర్నించి కథ పట్టుకుపోయి, పార్కులో మెల్లిగా ఆమెతో మాట కలిపాను.

"మిమ్మల్ని రోజూ చూస్తుంటే కథ రాయాలన్న ఇన్‌స్పిరేషన్ కలిగింది నాలో. మీ అందమే నాలో నాకు తెలియకుండానే మూడ్ పుట్టించి నా చేత ఈ కథ రాయించింది కాబట్టి ఏ పత్రికకీ పంపకముందే, ముందుగా మీరు చదవాలని నా కోరిక." అంటూ కథ అందించాను".

ఆనందంగా అందుకుని "రేపు చెప్తాను మీ కథమీద నా అభిప్రాయం" అంది. ఇదిగో ఇవాళ ఈ రూపంలో వాళ్ళన్నయ్యద్వారా అభిప్రాయం చెప్పింది."

ఒంటిమీదున్న దెబ్బలు చూపించాడు చలం. "హతోస్మి" మంచంమీద వెనక్కి విరుచుకుపడ్డాడు శ్రీపతి. ఓ అందమైన అమ్మాయికి కట్నం ఇచ్చి పెళ్ళిచేసే స్తోమతలేని తండ్రి ఉంటాడు.

ఏదో ఒక రోజు ఎవడో ఒకడు, నిన్ను ప్రేమించానంటూ ముందుకొచ్చి కట్నం లేకుండా పెళ్లి చేసుకోకపోతాడా అన్న ఆశతో ఆమె రోజూ పార్కుకొచ్చి వొచ్చేపోయే కుర్రాళ్ళ వంక ఓరచూపులు చూస్తూ వుంటుంది. తలొంచుకుని కూర్చున్నట్టే కూర్చుని, క్లుప్తంగా, శ్రీపతి రాసిన కథలో సారాంశం ఇది. మరి చలాన్ని తన్నులు తన్నక నెత్తి నెట్టుకుంటాడా ఆ పిల్ల అన్నయ్య.

★☆★☆★